# తుమ్-హమ్

అచ్ఛీ, అని తుమ్మింది సుహాసిని. ఆ తుమ్ముకి, ఆఫీసులో చుట్టూ ఉన్న వారంతా, సుహాసినికేసి చూసారు.

కొందరు, ఏమిటి అంత గట్టిగా తుమ్మావు? అన్నట్లు విసుగ్గా ముఖం పెట్టారు.మరి కొందరు చిరునవ్వుతో చూసారు. సుహాసిని తుమ్ముకి టేబుల్ మీద కాగితాలు మాత్రం అదిరిపడి రెపరెపలాడాయి.

తుమ్ము రావడంతో సుహాసినికి, బామ్మా, తాతా, జ్ఞాపకం వచ్చారు, అనడం కంటే తన గుండెల్లో గూడు కట్టుకున్నారన్నది నిజం.

అన్నం, నిద్ర, అయినా మరచిపోతుంది కాని, తాతయ్యనీ బామ్మని ఎలా మరచి పోతుంది?

వచ్చే నవ్వుని ఆపుకుని, కుడిచేతిని నోటికి అడ్డం పెట్టుకుంది, ఎవరేనా తనని చూస్తున్నారేమోనని, అటూ ఇటూ చూసింది. కొన్ని ఎదురుచూపులు, కొన్ని బెదురు చూపులు, తననే గమనిస్తున్నాయని కనిపెట్టింది సుహాసిని. వీళ్ళకి, మా బామ్మ తాతయ్య తుమ్ముల సంగతి తెలియదు. తెలిస్తే పొట్ట చెక్కలయేటట్లు నవ్వుదురు. తాతయ్య తుమ్మడం, బామ్మ భయం. మా తాతయ్యకి, ఎప్పుడూ తుమ్ములు వస్తూండేవి. తుమ్ము లంటే భయం, ఏ పనికేనా దుశ్శకునం అని, మా బామ్మకి వాళ్ళ బామ్మ చెప్పిందిట. సుహాసినికి తన చిన్ననాటి సంగతులు జ్ఞాపకం రాసాగాయి. అన్నం గిన్ని స్టౌ మీదకి ఎక్కించేటప్పుడూ, కూర తరిగేటప్పుడూ, ఇంకా కొత్త బట్టలు కట్టుకునేటప్పుడు మా తాతయ్య తుమ్మాడో! ఆరోజున వెయ్యి దేముళ్ళకు మొక్కేది, ఏ ఇబ్బందీ లేకుండా, పనులన్నీ సక్రమంగా జరగాలని. ఆతర్వాత తాతయ్యతో దెబ్బలాట పెట్టుకునేది.

'ఏమిటా తుమ్మడం? ఇంత చదువుకున్నారు, అంతపెద్ద ఉద్యోగం చేస్తున్నారు. తుమ్మకుండా ఉండలేరా?' అని కసురుకునేది. సణుక్కునేది. ఒక్కొక్కప్పుడు విసుక్కునేది మా బామ్మ. రాత్రివేళ అన్నం తింటూవుండగా తుమ్మితే, తాతయ్య నెత్తిన నీళ్ళు చల్లి 'ఏ వూర్లో పుట్టారు, దేముడి పేరు ఏమిటి' అని విసిగించేది.

ఒకప్పుడు ఆమె మాటలు పట్టించుకునేవాడు కాదు, రానురాను, తాతయ్య తుమ్ములు ఎక్కువైనాయి, బామ్మ సాధింపూ ఎక్కువయింది.

దాంతో తాతయ్య 'నన్నేం చేయమంటావే ఇన్ని తుమ్ములు వరసపెట్టి తుమ్మలేక నేను చస్తూంటే, నీ వెధవ సాధింపు ఏమిటి?' అని, దెబ్బలాటకి వచ్చాడు.కొంచెం చిన్న బుచ్చుకునేవాడు పాపం.

'అలా, మీదమీదకి వస్తారేమిటి? కొడతారా ఏమిటి? ఒకటా రెండా వరస పెట్టి పాతిక తుమ్ములు తుమ్మారు. నేను లెఖ్ఖ పెడుతూనే ఉన్నాను' అంది కొంచెం భయపడుతూను, వెనక్కి వెనక్కి నడుస్తూను.

పాపం, తాతయ్య ఈసారి, కొంచెం కోపం తగ్గించుకుని, ఏంచెయ్యను మరీ, అన్నట్లు అపాలజీ ఇస్తూన్నట్టు బామ్మకేసి చూసాడు. దాంతో తాతయ్యని లోకువకట్టి, విసవిస లాడుతూ, బామ్మకి ఆ చూపుతో, ధైర్యంవచ్చి కొంచెం రెచ్చిపోయి, పమిట కొంచెం బొడ్డులో దోపుకుంటూ, రణరంగంలోకి దూకే సత్యభామ పోజులో, తాతయ్య మీదికి చేతులు తిప్పుతూ, 'ఇదంతా నా ఖర్మ' అని తల బాదుకుంది.

తాతయ్య ప్రేమగా బామ్మని 'అలా తల బాదుకోకే' అని చేతులు పట్టుకుని బతిమిలాడాడు.

ఆ తుమ్ములు గురించి, తాతయ్యా బామ్మా దెబ్బలాడుకుంటున్నప్పుడల్లా, నేనూ తమ్ముడూ సరదాగా చూస్తుండేవాళ్ళం.

'అక్కడనుంచి ఇలా రండి' అని మాఅమ్మ కేకలేసేది. 'ఏం? సోద్యం చూస్తున్నారా? ఇక్కడనుంచి పొండి' అని బామ్మ కోప్పడేది.

మధ్యమధ్యన మా నాన్నగారు బామ్మని కేకలేసేవారు. "అమ్మా! నాన్నగార్ని హాయిగా స్వేచ్ఛగా తుమ్మకోనియ్యవే, ఆయన మాత్రం ఏం చేస్తారు, ఆయన తత్వమే అంత' అన్నారు.

బామ్మ వెంటనే 'తత్వం అంటే జ్ఞాపకం వచ్చింది. ఓసారి, ఏ డాక్టర్‌కో చూపించరా?' అంది. ఎందుకేనా మంచిదని హోమియోపతి మందులిచ్చే డాక్టరు దగ్గిరకి తీసుకువెళ్ళాడు మానాన్న.

వాళ్ళు తిరిగి వచ్చేదాకా గుమ్మంలోనే కూచుని ఎదురుచూసింది బామ్మ. వాళ్ళు ఇంటికి రాగానే, 'డాక్టరుగారు, ఏమన్నారు?' అని ఉత్సాహంగా అడిగింది. రోగి లక్షణాలు

అన్నీ చెప్పాను. డాక్టరుగారు మందులు రాస్తుంటే, నాన్నగారు తుమ్మారు, వెంటనే డాక్టరు గారికి కూడా తుమ్మువచ్చింది. దాంతో పోటాపోటీగా ఇద్దరూ తుమ్మారు. డాక్టరుగారు 'ఈసారి, మీ నాన్నగారిని తీసుకురాకండి, మందులకోసం వచ్చినప్పుడు' అన్నారు. మేం వచ్చాక ఎన్ని తుమ్ములు తుమ్మాడో పాపం' అన్నాడు మానాన్న.

అంతా విని బామ్మ 'ఇదేమిట్రా, ఆవలింతకి వెంటనే ఎదుటి వారికి ఆవలింత వస్తుంది కాని తుమ్ములకి జవాబు తుమ్ములేమిట్రా' అని వాపోయింది. మా తాతయ్య మాత్రం మౌనంగా ఉండి, ఆ మందులు వారంరోజులు వాడాడు. ఏమీ మార్పు రాలేదు సరికదా బామ్మకుకూడా ఆవేళ నాలుగు తుమ్ములు వచ్చాయి, దాంతో భయపడిపోయి 'ఇదేం ఖర్మమో ఇంట్లో అందరం ఇలా తుమ్ముతామో ఏమో? ఒరేయి అబ్బాయి, ఈసారి ఇంగ్లీషు డాక్టర్‌కి చూపించరా' అంది బామ్మ ఆవేదనతో.

తాతయ్య కూడా 'ఇంక ఆలస్యం చేయద్దు. డాక్టర్ దగ్గిరకి వెళదాం పద. ఈవేళ ఆఫీసులో కాగితాలమీద సంతకాలు పెడుతుంటే, నా తుమ్ములతో, కాగితాలన్నీ హడలిపోయి రెపరెపలాడి పోయాయి. గుమాస్తాల ముఖాలు కూడా వాడిపోయాయి, బిక్కమొహాలతో ఏమనలేక, వాళ్ళని నేను, నన్ను వాళ్ళు, చూసుకుంటూ నివ్వెరపోయాం' అన్నాడు.

అది విని, మా అందరికీ జాలేసింది తాతయ్యని చూసి. సరేనని ఓ మంచి స్పెషలిస్టు దగ్గిరకి తీసుకువెళ్ళాడు. బ్లడ్ టెస్టు చేసారు, ఎక్స్‌రే తీసారు. బ్లడ్ ప్రెషర్ చూసారు, స్టెతస్కోపుతో గుండెలు పరీక్షించి వెయ్యి రూపాయల మందులు రాసి ఇచ్చి తన ఫీజు ఒక వెయ్యి తీసుకుని పంపించాడు డాక్టరు.

ఇంక తగ్గుతాయి తుమ్ములు అని ధైర్యంగా ఇంట్లోనివారంతా నాలుగు రోజులు నవ్వుతూ కళకళలాడుతూ తిరుగుతున్నాం అంతే.

ఇంతలోనే తాతయ్యకి తుమ్ములు మొదలైనాయి. అదిచూసి, బామ్మ పెద్దగా రాగాలు మొదలు పెట్టింది. ఏమిటని ఇంట్లోనివారమంతా బతిమిలాడి అడిగితే ఏడుస్తూ 'మీ తాతయ్య తుమ్ముల గురించేనే, మా తమ్ముడు కొడుకు పెళ్ళి, 'తొందర్లో నిన్నూ బావగార్నీ పిలవడానికి వస్తా'ననీ రాసాడు. నాకు పెళ్ళికి వెళ్ళాలని ఉంది. ఏం చెయ్యాలి అని బాధగా ఉంది' అంది బామ్మ.

'నాకు తుమ్ములు వస్తాయనీ, అందుకే పెళ్ళికి రావటంలేదనీ, నీతమ్ముడుకి

నచ్చచెప్తాను, నువ్వు అలా బాధపడకు' అని బామ్మని తాతయ్య ఊరుకోబెట్టాడు.
'మా తమ్ముడంటే నమ్ముతాడు, మిగతా బంధువర్గం అలా ఊరుకోరండీ' అంది గద్గద స్వరంతోను.
'పోనీ ఓ పని చెయ్యి నా లెటరు పేడ్ మీద, విపులంగా రాసి సంతకం చేసి ఇస్తాను. అంతకీ నమ్మకపోతే, ఈ లెటరు చూపించు' అని ఇచ్చాడు.
అది పట్టుకుని మా వెర్రి బామ్మ పెళ్ళికి వెళ్ళింది. 'ఏడీ మీ ఆయన రాలేదేం?' అని ఎవరేనా అడిగితే, బంధువులందరికీ ఈలెటరు చూపించింది బామ్మ.
'ఇదేం నమ్మేటట్లు లేదు. ఇదేదో నిన్ను ఏడిపించడానికి పన్నిన పన్నాగం' అని కొందరు నవ్వారు. మరి కొందరు సానుభూతితో చూసారుట.
ఆలోచనలు ఎప్పుడూ ఒకలాగా ఉండవు కదా? మా బామ్మ ఆలోచనలు మరీ గొప్పవి. మరో పెళ్ళికి, బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళవలసి వచ్చింది. మేం ఎవరం రాము అన్నాం, ఇంక మా తాతయ్యని పట్టుకుంది, సరదాగా మనం ఇద్దరం పెళ్ళికి వెళదామని.
'నేను రానే మొర్రో అంటే వినవు' అన్నాడు తాతయ్య.
' పెళ్ళిలో, దంపత్తాంబూలాలని పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు చేత ఇప్పిస్తారు. నాకు ఆ సరదా తీరలేదు. మీరు కూడా రండీ' అంది గోముగా. తాతయ్యకి కూడా పోనీ పెళ్ళికి వెళదామేమిటి అని సరదా వేసింది కాబోలు. పెళ్ళి అనగానే బూర్లూ పులిహోరా జ్ఞాపకం వచ్చి నోరూరింది. రంగు రంగు చీరల్లో సీతాకోకచిలకల్లాగా, ఆడవాళ్ళంతా సరదాగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ, వరసైన వార్ని ఆటపట్టిస్తూంటే చూడాలనిపించింది, కాబోలును.
' పోనీలేవే, నువ్వు అడిగినట్లు నేనూ వస్తాను. ఎప్పుడూ ఆఫీసు కాగితాలు, తుమ్ములూ, విసిగి పోతున్నాను' అన్నాడు నవ్వుతూను.
'అంతకీ తుమ్ము వస్తే బయటికివెళ్ళి తుమ్ముతాను, మంగళసూత్రం కట్టే వేళకి, అక్కడ ఉండను' అన్నాడు.
'నల్లపూసలు కట్టే వేళ కూడాను, అత్తయ్యా'అని జ్ఞాపకంచేసింది మాఅమ్మ, బాధ్యతా యుతంగా చెప్పింది.
'అవునండోయి అదీ నిజమే' అంది బామ్మ నవ్వుకుంటూను.
సరే, ఇంక పెళ్ళి చూట్టానికి లేదు పెళ్ళికి వచ్చిన వార్ని చూడాల్సిందే, సరేపద ఏం

జరుగుతుందో చూద్దాం అని, బామ్మాతాతయ్య పెళ్ళికి వెళ్ళారు సరదాగాను మురిసిపోతూను.

వాళ్ళు వచ్చాక, పెళ్ళికబుర్ల కోసం మేం ఎదురుచూసాం. వెళ్ళినవాళ్ళు ఒక్కరోజులో తిరిగివచ్చారు. 'ఏమిటి? పెళ్ళి సంగతులు' అని నాన్న ప్రశ్నించాడు.

తాతయ్యకేసి కోపంగా చూస్తూ 'మీ నాన్ననే అడుగు' అంది బామ్మ.

'మీ అమ్మనే అడుగు' అని తాతయ్య కోపంగా చూసాడు.

'ఏదైనా ఇబ్బంది అయిందా పెళ్ళిలోను' అని అడిగింది అమ్మ.

'ఏం చెప్పమంటారు, అనుకున్నంతా అయింది.పెళ్ళివేళ అందరూ సరదాగా కబుర్లు చెప్పుకున్నాం. నోరూరే రుచులతో వంటకాలు బాగున్నాయి. భోంచేసి తాంబూలం వేసుకుని వరసైన వాళ్ళని వేళాకోళం ఆడాం. ఇంక పెళ్ళి ముహూర్తం టైముకి, బైటికి వెళదాం అని లేచాను. పెళ్ళివేళ మంగళ సూత్రధారణ చూసి అక్షింతలు వేసి అప్పుడు అవతలికి వెళ్ళి పేకాట వేద్దాం. తెల్లవారేదాకా ఆడదాం, అని నా ప్రక్కన కూర్చున్న బంధువర్గం అనడంతో, ఆ, ఇప్పుడు తుమ్ము రాదులే అనుకున్నాను, అమ్మో, తుమ్మని నమ్మకూడదు అని లేవ బోతుంటే చెయ్యట్టుకుని కూర్చోవయ్యా అని కూచోబెట్టాడు నా పక్కనున్న అతను.

నాకు తుమ్ము వచ్చేట్టు ఉంది అన్నాను, అంతే తుమ్ము వచ్చేసింది. ఆ పక్కన ఉన్నాయన తుమ్మాడు.

'బాజాభజంత్రీలు ఉన్నాయి కదా? గట్టిగా అవి మ్రోగడం ఇలాంటి ఇబ్బంది ఉంటుందనే కద్దా' అంది మా అమ్మ.

'అవేం పని చేయలేదు. అదేం ఖర్మమో, వరసగా నలుగురు అయిదుగురేనా తుమ్మి ఉంటారు, సరే నాతుమ్ములు ఆగటం లేదు.ఒకాయన పెళ్ళిపెద్ద వచ్చి 'అవతలికి పోయి తుమ్ముకోండయ్యా, అలా వరసపెట్టి తుమ్ముతున్నారు పెళ్ళి పందిట్లోను. ఏం పెద్ద మనుషులయ్యా మీరు... నేను గమనిస్తూనే ఉన్నాను' అని గట్టిగా అరిచాడు.

'ఇదిగో ఈయన తుమ్మడంతో నాకు తుమ్ము వచ్చింది.తప్పు నాది కాదు' అన్నాడు నన్ను చూపిస్తూను.

'అబ్బే నేనుకాదు ముందు తుమ్మితా' అని అబద్ధం ఆడాను. ఎలిమెంటరీ స్కూలు పిల్లాడిలాగ చేతులు కట్టుకుని సిగ్గుపడుతూను.

'ఎవరు ముందు తుమ్మారు అని కాదు నా ప్రశ్న, ఎందుకు తుమ్మారు పెళ్ళి పందిరిలో తిని తీరిగ్గా కూచుని అని. ముక్కులో తిరిపెట్టుకుని మరీ తుమ్మారేమోనని నా అనుమానం' అని గదిమి పారేస్తున్నాడు, ఒంటికాలిమీద లేస్తూను. ఎలారా భగవంతుడా అనుకుంటూంటే నేను, ఇంతలోకే మరొక పెళ్ళిపెద్ద వచ్చి 'ఏదో జలుబు తుమ్ములు, ఊరుకోండయ్యా' అన్నాడు.

నవ్వుకుంటూ ఒక కుర్రాడు వచ్చి, తీరా చూస్తే మా ఆఫీసులో కొత్తగా ఉద్యోగానికి చేరినవాడే. 'నమస్తే సార్' అని నన్ను పలకరించి, 'వీరు మా ఆఫీసర్‌గారు. వీరు పాపం ఆఫీసులోనూ ఇలాగే తుమ్ముతారు. ఆయన తుమ్ము శుభసూచకమే' అని, సముదా యించాడు.అందర్నీ మాటలతో తరిమేసాడు. కాని రేపు ఆఫీసులో ఈ సంగతులన్నీ చెప్తాడో ఏమిటో ఖర్మ. ఆఫీసరు హోదాలో ఉన్నా, అందరికీ ఇంట్లోనూ బయటా లోకువైపోయాను. ఏ జన్మలో ఏం పాపం చేసానో ఏమో ఖర్మ' అని తాతయ్య బాధ పడుతోంటే మాకందరికీ జాలేసింది.

ఇంక మాబామ్మ ' నేను దంపతుల తాంబూలం పుచ్చుకునే సరదా తీరలేదు సరికదా ఇంత గందరగోళం జరిగింది. ఇంక అక్కడ ఉండలేక చక్కా వచ్చాం'అంది.

' నేను రానే అంటే విన్నావా? బలవంతంగా తీసుకు వెళ్ళావు ఇంత వయసు వచ్చినా, పెళ్ళి సరదాలు, దంపత్తంబూలాలూ అంటావు, జుట్టు నెరిసింది. మనవలు పుట్టారు. అయినా నీకు పెద్దతరహా రాలేదు. పెళ్ళిలో ఆ పట్టుచీరా, మల్లెమొగ్గలు సిగనిండా చుట్టీ, అందర్నీ ఛలోక్తులు వేస్తూ ఏం కులుకుతూ తిరిగావే, నేను నిన్ను గమనిస్తూనే ఉన్నాను అన్నాడు' కోపంతో బామ్మని.

'ఆ..ఆ...మాటలు మీరకండి, మీలా తుమ్ముతూ కూర్చోలేదని ఈర్ష్య' అంది బామ్మ వెటకారంగాను.

అదేమిటో బామ్మాతాతయ్య ఇట్టే దెబ్బలాడుకునేవారు, ఇట్టే నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకునేవారు, కోపాలు, అలగడం ఎరగరు, పసివాళ్ళలాగా ఉండేవారు. వెంటనే బామ్మ ఆచ్చి అని తుమ్మింది. వరసగా నాలుగు తుమ్ములు. 'చిరంజీవి శతాయుష్షు' అన్నాడు తాతయ్య.

'అయ్యె బాబోయి, అంతా ఇలా తుమ్ముతూ ఉంటామో ఏమో ఖర్మ. అసలు నాకు ఒక ఆలోచన వస్తోంది' అంది,

'ఏమిటో చెప్పు, నీకు అలా, అలా, అలలు, అలలుగా ఆలోచనలు వస్తూంటాయి. ఏ జన్మ కాల నక్షత్రంలో పుట్టావో కాని, నాపాల పడ్డావు' అన్నాడు తాతయ్య.

చంటిపిల్లలా తాతయ్య దగ్గిరకి వచ్చి 'ఎప్పుడూ నన్ను ఆడి పోసుకోడమే. నేను స్వాతి నక్షత్రంలో పుట్టాను. దేవగణం తెలుసా?' అంది.

'అయితే ఏమిటో చెప్పు' అన్నాడు తాతయ్య.

'ఈ ఇంటి వాస్తు బాగా లేదేమో' అంది.

'నీ బొంద, ఆఫీసులో తుమ్ముతున్నాను, పెళ్ళికి వెళ్ళి తుమ్మాను.' అని ఖసురుకున్నాడు.

బామ్మ ముఖం చిన్నబోయింది, మాకు జాలేసింది.

'నీ ఆలోచన నీ ముఖంలాగే ఉంది.' అన్నాడు.

ఇదేదో గడ్డు సమస్యలాగా, ఆ ఇంట్లో అంతా విచారించాము తలల పట్టుకుని.

తాతయ్య, ఆఫీసుకు వెళితే కాస్త ప్రశాంతంగా ఉంటుంది. మా బామ్మ వాదోపవాదాలు తగ్గుతాయి అని ఆఫీసుకు వెళ్ళి పోతాడు.

ప్యూన్ ఫైలు పట్టుకుని కొన్ని కాగితాలు సంతకం పెట్టమని పట్టుకు వచ్చాడు. తాతయ్య తుమ్మాడుట. వెంటనే ప్యూన్ నవ్వాడుట.

'ఇదంతా, నా ఖర్మరా' అన్నాట్ట తల పట్టుకుని.

'అంత మాటనకండి. మీరు మన్నిస్తే మీకో ఉపాయం చెబుతాను'అన్నాట్ట.

'ఏమిటో చెప్పరా బాబూ!'అని ప్రాధేయపడ్డాడుట.

'ఆఫీసు గది తలుపు దగ్గరగా వేసిరా. అప్పుడు చెబుదువు గాని'అన్నాట్ట.

అంతే, వెంటనే తన రొంటినున్న ముక్కుపొడి డబ్బా తీసి 'అయ్యా! తమరు రెండు పట్లు పొద్దున్న, సాయంకాలం పీల్చారంటే, నాలుగు రోజుల్లో, మీకు తుమ్ముల బాధ వుండదు' అన్నాట్ట.

'నమ్మమంటావా?' అని తాతయ్య అడిగాడు.

'అయ్యా, సత్యం చెబుతున్నాను.'అన్నాట్ట.

'నీకు ఎవరు చెప్పారురా?'అంటే, 'మాతయ్య ముక్కుపొడి తయారుచేసేవాడండి.మాతయ్య చెప్పాడండి.'అన్నాట్ట.

అంతే... తాతయ్యకి సంజీవి పర్వతం దొరికినంత ఆనందం అయింది.

అంతే, తాతయ్య తుమ్మడం మానేసాడు.కారణం ఏమిటని, మాబామ్మ అడిగితే,

'అమ్మా, నేను చెప్పను' అని మురిపించుకునేవాడు.

ఎలా అయినా, తాతయ్య తుమ్మడం మానేయడంతో, మాబామ్మకి వాగ్యుద్ధానికి తాళం పడింది.ఇల్లు కొంచెం చిన్నబోయినట్లు అనిపించేది.

'నాకు చెప్పు తాతయ్యా!' అంటే,'మీబామ్మకి చెప్పకేం...ఒట్టు'అని అప్పుడు నాకు చెప్పాడు.

సుహాసిని ఆఫీసులో అంతా రణగొణధ్వని చేస్తూండగానే లంచ్ అవర్ అయింది.

'ఊహాలోకంనుంచి లేచి రా'అని ప్రక్క సీటులోని స్నేహితురాలు పిలవడంతో, జ్ఞాపకాల వలయంనుంచి సుహాసిని నవ్వుకుంటూ లేచింది.

❄❄❄

కథా నిలయం
5593
శ్రీకాకుళం